

టిప్పర్‌ను ఢీకొట్టిన బస్సు
ఆగి ఉన్న టిప్పర్‌ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్‌తో పాటు ముగ్గురికి గాయాలయ్యాయి.
- 8లో



ప్రాజెక్టులపై కదలిక వచ్చేనా!
నూతన ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై కదలిక వచ్చేనా అన్న చర్చ సాగుతోంది.
- 8లో



వణికిస్తున్న వైరల్ ఫీవర్
వాతావరణంలో వస్తున్న మార్పులు, చలితీవ్రత పెరగడంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు.
- 10లో

న్యూస్‌రీల్

రిటైర్డ్ ఉద్యోగులకు నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ (శుక్రవారం) ఉదయం 10గంటలకు నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మ్యాక్స్ విజన్ శ్రీమహాలక్ష్మీ కంటి ఆసుపత్రి వైద్యుల నేతృత్వంలో కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరానికి రిటైర్డ్ ఉద్యోగులు విధిగా హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి కృష్ణవేణి

హాలియా: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సరియైన పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. గురువారం హాలియా రైతు వేదికలో నిర్వహించిన అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టులోని నాలుగు మండలాల సిబ్బంది సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విధిగా పోషకాహారం అందించాలన్నారు. అనంతరం భేటి బచావో–భేటీ పడావో, సఖీ కార్యక్రమంలో భాగంగా గృహహింస, వరకట్న వేధింపులు, బాలికలు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, భ్రూణహత్యల నిర్మూలనపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంఎస్‌కే కోఆర్డినేటర్ సునీత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, సీడీపీఓ పద్మావతి, ఏసీడీపీఓ సువర్ణ, సూపర్ వైజర్లు రమాదేవి, సరిత, వెంకాయమ్మ, గౌసియా బేగం, విజయలక్ష్మి, నాగమణి, యాదమ్మ, సైదా బేగం, రాజేశ్వరి ఉన్నారు.

సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: 2024–25 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో బాలబాలికల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ గురువారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే ఏడాది మార్చి 31వరకు 10 నుంచి 12 సంవత్సరాల వయసు కలిగి ఉండి 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 9వ తరగతిలో ప్రవేశానికి వచ్చే ఏడాది మార్చి 31వరకు 13 నుంచి 15 సంవత్సరాల వయసు కలిగి ఉండి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. జనరల్, ఎక్స్ సర్వీస్ మెన్, రక్షణ దళాల్లో పని చేసేవారు, ఓబీసీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఫీజు రూ.650, ఎస్సీ, ఎస్టీలకు రూ.500గా నిర్ణయించారని తెలిపారు. exams.nta.ac.in అనే వెబ్ సైటు ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. ఈనెల 16 సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి గడువు ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష ఫీజు ఈనెల 16న రాత్రి 11.50 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 21 ప్రవేశపరీక్ష ఓఎంఆర్ పద్ధతి ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. నిత్యకల్యాణ వేడుకను ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఆచార్యులు కనుల పండువగా చేపట్టారు. అంతకుముందు ఆలయాన్ని వేకువజామున తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాతం, అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహనసేవ, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సాగుకు నీరు లేదు!

జలకళ కోల్పోయిన కృష్ణమ్మ
- సాగర్ ఆయకట్టులో క్రాప్ హాలీడే ప్రతిపాదన
- ఎడమ కాలువ పరిధిలో 6.30 లక్షల ఎకరాల్లో యాసంగికి బ్రేక్
- నీటిని విడుదల చేస్తారని కొన్ని చోట్ల నాట్లు
- డెడ్ స్టోరేజీకి దగ్గరలో ప్రాజెక్టు నీటిమట్టం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- ఏకేబీఆర్ కింద 2.85 లక్షల ఎకరాలకూ గడ్డుకాలమే..

సరైన వర్షాలు లేక కృష్ణమ్మ పరవళ్లు కనిపించకుండా పోయాయి. జలకళతో ఉండాల్సిన జీవనది అడుగంటిపోయింది. ఫలితంగా నాగార్జునసాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువైంది. సాగునీటిని ఇవ్వలేని దుస్థితిలో ఉన్న ప్రాజెక్టును చూసి ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాగడానికి తప్ప సాగుకు నీరివ్వొద్దని రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ.. ప్రభుత్వానికి ప్రతిపాదించింది. వరి సాగే జీవనాధారంగా బతుకున్న ఆయకట్టు రైతులు వానాకాలం సీజన్‌లో ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు యాసంగిలో అసలే సాగునీరు రాని పరిస్థితులు ఏర్పడటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



త్రిపురారం మండల కేంద్రంలో సాగు చేయకుండా వదిలేసిన వ్యవసాయ భూమి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టుతోపాటు సాగర్ బ్యాక్ వాటర్‌పై ఆధారపడిన దాదాపు 9 లక్షల ఎకరాల సాగుకు గడ్డుకాలం వచ్చి పడింది. సాగర్ కాలువల నీరే ప్రధాన వనరుగా వరి సాగయ్యే ఆ భూములు ఇప్పుడు బీళ్లుగా మారే ప్రమాదం వచ్చి పడింది. సాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో కాలువలు, ఎత్తిపోతల పథకాల కింద 1,45,720 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గంలోని పది మండలాల్లో 2,29,961 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా, ఖమ్మం నియోజకవర్గంలోని 15 మండలాల్లో 2,54,408 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో మొత్తంగా 6,30,089 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నా ఈసారి యాసంగిలో చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదు. వానాకాలంలోనే బోరు బావుల కింద నల్లగొండ, ఖమ్మం రెండు ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 2.5 లక్షల ఎకరాలు సాగు చేయగా, యాసంగిలో లక్ష ఎకరాలు సాగయ్యే పరిస్థితి కూడా కనిపించడం లేదు. మరోవైపు సాగర్ డెడ్ స్టోరేజీ 510 అడుగులు కాగా, ప్రస్తుతం 522 టీఎంసీల నీరు ఉంది. ఆ నీటిని నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటి అవసరాలకు మాత్రమే ఇస్తారు.



వేములపల్లిలో సాగు చేయని భూములు

ఏకేబీఆర్ పరిధిలోనూ దుర్భర పరిస్థితులే..

నల్లగొండ జిల్లాలో 2.85 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) ద్వారా కూడా సాగునీటిని ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. సాగర్ బ్యాక్ వాటర్‌ను పుట్టంగండిలోకి ఎత్తిపోసి, ఏకేబీఆర్ ద్వారా జిల్లాలోని 2.85 లక్షల ఎకరాలకు ప్రస్తుతం సాగు నీరు అందుతోంది. దీనికింద కూడా వానాకాలంలో పెద్దగా సాగునీరివ్వలేదు. యాసంగిలోనూ ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇలా మొత్తం రెండు ఉమ్మడి జిల్లాల్లో కలిపి బోర్లు, బావుల కింద యాసంగిలో 2.5 లక్షల ఎకరాలు కూడా సాగయ్యే పరిస్థితి కనిపించడం లేదని అధికారులే పేర్కొంటున్నారు.

20 ఏళ్ల తరువాత మళ్లీ క్రాప్ హాలీడే..

సాగర్ ఆయకట్టులో 20 ఏళ్ల కిందటి కరువు ఛాయలు అలుముకున్నాయి. 2002లో వర్షాలు పడని కారణంగా ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో వరద రాక నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు అడుగంటి పోయాయి. దీంతో అప్పట్లో ప్రభుత్వం ఎడమ కాలువ కింద ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేమని క్రాప్ హాలీ డే ప్రకటించింది. ఆ తరువాత మళ్లీ ఇప్పుడే అంతటి కరువు పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సాగర్ నీటిని విడుదల చేస్తారనే ఆశతో కొన్ని చోట్ల నాట్లు వేసిన రైతులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

నష్టపోవాల్సిందేనా?



సాగర్ నీరు ఇస్తారనే ఆలోచనతో నాట్లు వేశాం. 15 రోజులు అవుతోంది. ఇప్పుడు నీరివ్వకపోతే పంట ఎండిపోవడమే. నాకున్న రెండెకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని నాట్లు వేశాం.

–గువ్వల ఆంజనేయులు, బూరుగడ్డ, హుజూర్‌నగర్

ప్రభుత్వం ఆలోచించాలి



యాసంగిలో పంటలకు నీరివ్వకపోతే అప్పులపాలు అవుతాం. ఇప్పటికే పెట్టుబడి పెట్టాం. పంట ఎండిపోతే కష్టం. ప్రభుత్వం ఆలోచించి నీటిని విడుదల చేయాలి.

–జిట్రిపోతుల ప్రభంజన్, మొల్కపట్నం, వేములపల్లి

బతుకు ఆగం



కాలువ నీరు వస్తుందని సాగు చేస్తున్నాం. అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్నాం. నీళ్లివ్వకపోతే ఎలా? మాలాంటి చిన్న రైతులు బతుకులు ఆగం అవుతాయి.

–నడ్డి కొండల్‌యాదవ్, చల్మారెడ్డిగూడెం, అనుముల

ఆశతోనే సాగు చేశాం



ప్రభుత్వం నీటిని విడుదల చేస్తుందనే ఆశతో నాట్లు వేశాం. వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. ఇప్పుడు కాలువ నీరు రాకపోతే పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోతాం. ప్రభుత్వం ఆలోచించాలి.

–మామిడి జానకి రాములు, మేడారం, నేరేడుచర్ల

విద్యుత్ శాఖలో ఇష్టారాజ్యం

- నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగుల బదిలీ
- నిషేధమున్నా పట్టించుకోని ఆ శాఖ ఎస్‌ఈ
- ఇప్పటికే ముగ్గురు ఇంజనీర్ల ట్రాన్స్‌ఫర్
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు



నల్లగొండ: జిల్లాలోని విద్యుత్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరుగుతున్నాయి. ఆ శాఖ ఎస్‌ఈ నిబంధనలు తుంగలో తొక్కి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉద్యోగులను బదిలీ చేశారని సొంతశాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖలో బదిలీలకు సంబంధించి నిషేధం ఉన్నప్పటికీ అదేమీ పట్టించుకోకుండా ముగ్గురు ఇంజనీర్లను బదిలీ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఎన్నికల కోడ్ ముగిసిన మరుసటి రోజే..

అసెంబ్లీ సాధారణ ఎన్నికల కోడ్ డిసెంబర్ 5వ తేదీన ముగిసిన మరుసటి రోజే బదిలీలకు తెర లేపారు. దీనికి తోడు విద్యుత్ శాఖలో బదిలీలకు సంబంధించి నిషేధం కూడా ఉంది. అయినప్పటికీ బదిలీలు చేసేశారు. ఇందులో నల్లగొండ ఎంఅండ్‌పీలో పనిచేసే ఏఈ అమర్‌సింగ్‌ను మిర్యాలగూడ రూరల్ ఏఈగా బదిలీ చేశారు. అదేవిధంగా సెలవులో ఉన్న ఏఈ అశ్వినిని నల్లగొండ ఎంఅండ్‌పీ ఏఈగా పోస్టింగ్ ఇచ్చారు. ఇదిలా ఉంటే హాలియాలో సబ్ ఇంజనీర్‌గా పనిచేసిన షఫిని నల్లగొండ కమర్షియల్ సబ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. చండూరులో పనిచేసే నాగయ్య అనే వ్యక్తి రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉండి ఎప్పటి నుంచో నల్లగొండకు బదిలీ చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి రిటైర్‌మెంట్ దగ్గర ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి కానీ, సెలవులో ఉన్న ఏఈకి బదిలీ పోస్టింగ్ ఇవ్వడం పట్ల పలువురు అనుమానం వ్యకం చేస్తున్నారు. ఇకపోతే, సాగర్‌లో సబ్ ఇంజనీర్‌గా చేసే ఉదయ్ కిరణ్ తనను నల్లగొండకు బదిలీ చేయాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నా అతన్ని బదిలీ చేయకుండా హాలియాలో సబ్ ఇంజనీర్‌గా పనిచేసే షఫిని నల్లగొండ కమర్షియల్ విభాగానికి బదిలీ చేయడం పట్ల ఉద్యోగ సంఘాలు గుర్రుగా ఉన్నాయి.

బదిలీలపై అనుమానాలెన్నో..

విద్యుత్ శాఖ బదిలీలపై నిషేధం ఉన్నప్పటికీ ఆ శాఖ ఎస్‌ఈ పట్టించుకోకపోగా ఎన్నికల ప్రక్రియ ముగిసినా కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే పలువురు ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియలో ముడుపుల వ్యవహారం నడిచి పెద్ద ఎత్తున చేతులు మారినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అత్యవసరంగా బదిలీల ప్రక్రియ ఎందుకు చేపట్టాల్సి వచ్చిందని విద్యుత్ శాఖ ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎస్‌ఈని ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించకపోవడం గమనార్హం.

బదిలీలు కక్ష పూరితం

విద్యుత్ శాఖలో అనుకోకుండా ఏవైనా ప్రమాదాలు జరిగితే ఉన్నతాధికారులు ఒక్కో ఘటనపై ఒక్కో విధంగా వ్యవహరిస్తూ గిరిజన ఉద్యోగుల పట్ల పక్షపాతంగా ఉంటున్నారు. కొన్ని చోట్ల ప్రమాదాలు జరిగిన సందర్భంలో కింది స్థాయి ఉద్యోగులు మీద చర్యలు తీసుకుంటున్నారు. మిర్యాలగూడలో మాత్రం ఏఈని సరెండర్ చేయడం, నాంపల్లిలో పనిచేసే సబ్ ఇంజనీర్‌ను చండంపేట ఏఈగా బదిలీ చేయడం కక్ష పూరితమే.

– వెంకటేశ్వర్లు నాయక్, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి

ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి సూచించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 20న భూదాన్‌పోచంపల్లిలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ హనుమంతు కె.జెండగే, వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ ఆఫీస్ ఫర్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్, రాష్ట్ర చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశంతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం హెలిప్యాడ్ స్థలాన్ని సందర్శించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి శుక్రవారం అధికారిక ప్రకటన రానుందన్నారు. ఏచిన్నలోటు కూడా రాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, తహసీల్దార్ వీరాభాయి, ఎంపీడీఓ బాలశంకర్, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ శంకరయ్య, డీఈలు సుగేందర్, అభిషేక్ పాల్గొన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి

కిలో రూ.300కు ఎగబాకిన ధర
- గత నెలలో కిలో రూ.150 మాత్రమే..
- పంట దిగుబడి తగ్గడమే కారణం





నల్లగొండ టౌన్: రోజూ వివిధ రకాల కూరల్లో వినియోగించే వెల్లుల్లి (ఎల్లిగడ్డ) ధర అమాంతం పెరిగింది. నిత్యావసర వస్తువుల్లో భాగంగా నిత్యం ఉపయోగించే వెల్లుల్లిని నేడు సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. గత నెలలో కిలో వెల్లుల్లి ధర రిటైల్‌గా రూ.150 వరకు ఉండగా ప్రస్తుతం రూ.300లకు ఎగబాకింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజూ వండుకునే శాఖాహారంతోపాటు వారం వారం వండుకునే మాంసాహార వంటకాల్లో అల్లం, వెల్లుల్లి వినియోగం ఎక్కువగానే ఉంటుంది. ధర పెరిగిన కారణంగా ఆడవాళ్లు వెల్లుల్లి లేకుండానే కూరలు వండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మంచి రోజులు ఉండడంతో వివాహాలు, గృహ ప్రవేశాలు వంటి శుభకార్యాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెల్లుల్లి ధర గత నెలలో కంటే రెట్టింపు కావడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుభకార్యాలు చేసుకునే వారు మాత్రం తప్పనిసరిగా అధిక ధర వెచ్చించి వెల్లుల్లిని కొనక తప్పడం లేదు. ఇకపోతే చికెన్, మటన్ ప్రియులకు మాత్రం వెల్లుల్లి ధర పెరగడంతో వాటిని కొనేందుకు అదనపు భారంగానే మారింది.

పంటలు దెబ్బతినడంతో పెరిగిన ధర

గతంలో కురిసిన తుపానులు, అకాల వర్షాల కారణంగా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో వెల్లుల్లి పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది. దీంతో సప్లయ్ తగ్గి వెల్లుల్లి ధర భారీగా పెరిగిందని హోల్‌సెల్ వ్యాపారులు పేర్కొంటున్నారు. పంటలు దెబ్బతినకపోతే ధర తక్కువగా ఉండేదని వ్యాపారులు అంటున్నారు. రానున్న రోజుల్లోనూ ధర మరింత పెరిగే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

ఎల్లిగడ్డ పిరం అయ్యింది



ఎల్లిగడ్డ (వెల్లుల్లి) ధర ఇంత పిరం కావడం ఎన్నడూ చూడలేదు. రూ.300 పెట్టి కిలో ఎల్లిపాయలు కొనాలంటే భయమేస్తుంది. ప్రతి కూరలో ఎల్లిపాయలు వేసుకుంటాం. కూరల్లో ఎల్లిపాయలు వేయకుంటే రుచే ఉండదు. సర్కార్ స్పందించి ఎల్లిపాయల ధరను తగ్గించాలి.

– అందాలు, గృహిణి, దండెంపల్లి, నల్లగొండ మండలం

వెల్లుల్లి లేని కూరలు తింటున్నాం




ఎల్లిపాయల ధర పెరగడంతో సామాన్య ప్రజలు రుచిలేని కూరలు తినే పరిస్థితి ఏర్పడింది. ప్రతి కూరలో ఎల్లిపాయలు వేసుకుంటనే రుచిగా ఉంటుంది. అలాంటిది ఎల్లిపాయల ధర అమాంతం పెరగడంతో కొనలేక పోతున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకుని ధరను తగ్గించి సామాన్యులకు మేలు చేయాలి.

– శ్రీలక్ష్మి, గృహిణి, కోదండాపూర్, నల్లగొండ మండలం

పొదుపు సంఘాలకు వడ్డీ ఏదీ?

8 మున్సిపల్ కేంద్రాల్లో రూ.6.82 కోట్ల బకాయిలు
- నాలుగేళ్లుగా వడ్డీ సొమ్ము విడుదల చేయని ప్రభుత్వాలు
- మహిళలకు తప్పని ఎదురుచూపులు



నల్లగొండ టూటౌన్: జిల్లాలోని మున్సిపల్ కేంద్రాల్లో పొదుపు సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలపై చెల్లించిన వడ్డీ సొమ్ము తిరిగి రావట్లేదు. జిల్లా వ్యాప్తంగా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, చిట్యాల, నందికొండ, చండూరు, నకిరేకల్, హాలియా మున్సిపల్ పట్టణాల్లో పొదుపు సంఘాలకు 2019–20 సంవత్సరం నుంచి వడ్డీ రావాల్సి ఉంది. పొదుపు సంఘాల మహిళలకు ఏటా వడ్డీ విడుదల చేయాల్సి ఉన్నా.. నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదు. దీంతో వడ్డీకి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో పొదుపు సంఘాల మహిళలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

పేరుకే వడ్డీలేని రుణాలు

వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని పేరుకే చెబుతున్నారే తప్పితే బ్యాంకులు వసూలు చేస్తున్న వడ్డీని తిరిగి ఇవ్వడంలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. జిల్లాలోని మున్సిపల్ పట్టణాల్లో 6,575 పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ రావల్సి ఉంది. మెప్మా కార్యాలయంలోని అధికారిక లెక్కల ప్రకారం గత 2019–20 నుంచి 2022–23 సంవత్సరం వరకు రూ.6.82 కోట్లు వడ్డీ రావాల్సి ఉంది. అయితే జిల్లాలోని 8 మున్సిపల్ పట్టణాల్లో పొదుపు సంఘాలకు రావాల్సిన వడ్డీ బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారని మహిళలు ఎదురు చూస్తున్నారు. పలువురు మహిళలకు మున్సిపల్ కార్యాలయాల్లోని మెప్మా సిబ్బందిని వడ్డీ గురించి అడుగుతున్నా వారు కూడా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, చెప్పడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త సంఘాల ఏర్పాటుపై వడ్డీ ప్రభావం

మెప్మా ఆధ్వర్యంలోని ఏటా కొత్తగా మహిళా సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో సంఘం ఏర్పాటు చేయాలంటే 10 మంది మహిళలు ఉండాలి. ఒక్కో మహిళ రూ.100 చొప్పున బ్యాంకులో పొదుపు చేసిన తరువాత ఆరు నెలలకు రుణం ఇస్తారు. కానీ నాలుగేళ్లుగా సంఘాలకు ప్రభుత్వాలు వడ్డీ విడుదల చేయకపోవడంతో కొత్త సంఘాల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావట్లేదు. సంఘాల వాళ్లు తీసుకున్న రుణం ప్రతినెలా 10వ తేదీలోగా చెల్లించకపోతే తమకు అధిక వడ్డీ పడుతుందనే భయంతో కొత్త సంఘాల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. కొత్త ప్రభుత్వమైనా వడ్డీ డబ్బులు చెల్లిస్తే గ్రామాల్లో కొత్త సంఘాలు ఏర్పాటయ్యే అవకాశం ఉండనుందని మెప్మా విభాగం అధికారులు అంటున్నారు.

వడ్డీ రాగానే ఖాతాల్లో జమ చేస్తాం

పొదుపు సంఘాల రుణాలకు సంబంధించిన వడ్డీ ప్రభుత్వం నుంచి విడుదల కాగానే వారివారి ఖతాల్లో జమ చేస్తాం. 2019–20 సంవత్సరం నుంచి వడ్డీ డబ్బులు రావాల్సి ఉంది. ప్రభుత్వం త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది.

– శివాజీ, మెప్మా అధికారి, నల్లగొండ

18న నీలగిరి మున్సిపల్ సమావేశం

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 18వ తేదీ ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తమతమ శాఖాపరమైన సమాచారంతో విధిగా సకాలంలో హాజరు కావాలని కోరారు.

17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు జరగనున్నాయి. ఏటా ఈ దేవాలయంలో నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు జరుగుతాయి. ఈసారి కూడా ఉత్సవాలు నిర్వహించడానికి దేవాదాయ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా రోజూ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా గ్రామస్తులు అంతా కలిసి రాజకీయాలకతీతంగా ఈ ఉత్సవాలను జరుపుకుంటారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ముక్కోటి ఏకాదశి, కూడార్పై, గోదారంగనాథస్వామి కల్యాణోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ తెలిపారు. భక్తులు తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థాన ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డి కోరారు.

16న అయోధ్య అక్షింతల కలశాల శోభాయాత్ర



సూర్యాపేటలోని గీతామందిరంలో పూజలకు హాజరైన భక్తులు

భానుపురి: సూర్యాపేటలోని శ్రీ వేదాంత భజన మందిరం నుంచి ఈ నెల 16వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు అయోధ్య అక్షింతల కలశాల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు అయోధ్య తీర్థ క్షేత్ర జిల్లా సంయోజకుడు పర్వతం శ్రీధర్ కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తోట గణేష్ తెలిపారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని గీతా మందిరంలో ఏర్పాటు చేసిన అక్షింతల కలశాల పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీరాముని జన్మభూమి అయోధ్యలో విశేషంగా పూజలందుకున్న పవిత్ర అక్షింతలు సూర్యాపేట పట్టణానికి రావడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన కారు.. కానిస్టేబుల్ మృతి


శ్రీకాంత్ (ఫైల్)

నల్లగొండ క్రైం: బైక్‌పై వెళ్తున్న కానిస్టేబుల్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామ పంచాయతీకి చెందిన శ్రీకాంత్ నల్లగొండ పరిధిలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య దుర్గాదేవి, ఏడాది లోపు వయసున్న కుమార్తె ఉంది. గురువారం శ్రీకాంత్ పని మీద బెటాలియన్ నుంచి నల్లగొండ టౌన్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో చర్లపల్లి సమీపంలోకి రాగానే వెనుక నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంత్ భౌతికకాయానికి పోలీసు అధికారులు నివాళులర్పించారు.

బీరువాలో దాచిన నగదు అపహరణ

- నిందితుడు అరెస్ట్

రామన్నపేట: ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బును ఓ రైతు ఇంట్లోని బీరువాలో దాచగా చోరీకి గురయ్యాయి. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన మేడబోయిన సైదులుకు వారం క్రితం ధాన్యం అమ్మగా రూ 99,000 వచ్చాయి. ఆ డబ్బులను తన ఇంట్లో బీరువాలో దాచాడు. ఈ నెల 13న సైదులు, అతడి భార్య ఇంటికి తాళం వేసి తాళంచెవిని ఇంటి దర్వాజ పైన పెట్టి పొలం వద్దకు వెళ్లారు. గురువారం డబ్బులు అవసరమై బీరువా తెరిచి చూడగా అందులో డబ్బులు కనిపించడం లేదు. వెంటనే బాధితులు రామన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన నడిగోటి నరేష్‌పై అనుమానం ఉన్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నరేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు.

లారీల్లో డీజిల్ చోరీ

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి శివారులో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీల్లోని డీజిల్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు.. వట్టిమర్తి గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న టైర్ పంక్చర్ చేసే షాపుల వద్ద విశాంత్రి కోసం మూడు లారీలను బుధవారం రాత్రి డ్రైవర్లు నిలిపి ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆ లారీల్లోని డీజిల్ ట్యాంకుల నుంచి వెయ్యికి పైగా లీటర్ల డీజిల్‌ను చోరీ చేశారు. లారీ డ్రైవర్లు గురువారం ఉదయం గుర్తించి చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

కట్టంగూర్: మండల కేంద్రంలోని హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామానికి చెందిన సతీష్ బైక్‌పై తన స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు బయల్దేరాడు. కట్టంగూర్ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. సతీష్ ఎడమ కాలుకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించాడు.

సాగునీటి ప్రాజెక్టులపై కదలిక వచ్చేనా..!

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష
- పాల్గొన్న శాసనమండలి చైర్మన్, మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేలు


సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు

నల్లగొండ: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై కదలిక వచ్చేనా అన్న విషయంపై ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జిల్లాలోని ప్రాజెక్టులపై పెద్దగా దృష్టి సారించలేదు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించలేదు. దీంతో పెండింగ్ ప్రాజెక్టులు నేటికీ పూర్తికాని పరిస్థితి నెలకొంది. గురువారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలం కావాలంటే గతంలో మొదలు పెట్టిన డిండి, ఉదయసముద్రం, బ్రాహ్మణవెల్లెంల, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, నక్కలగండి, ఇతర రిజర్వాయర్లతోపాటు పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని కాల్వల పనులు కూడా పూర్తి చేయాల్సి ఉందని చర్చించారు. అయితే ఆయా ప్రాజెక్టులు ఎంత వరకు పూర్తయ్యాయి? ఇంకా ఎంత శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి.. ఇంకా ఎన్ని నిధులు అవసరం ఉందనే దానిపై పూర్తి స్థాయిలో నివేదికలు ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సూచించారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి – మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టుల విషయంలో చర్చించిన అనంతరం రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అటవీ అనుమతులను తీసుకురావడంతో పాటు నిధులు కూడా మంజూరు చేయిస్తామని చెప్పారు. అయితే అధికారులు కూడా చిత్తశుద్ధితో పనులు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలను సమానంగా చూడాల్సిన బాధ్యత అధికారులదన్నారు. అలా చూడకపోవడం వల్లే జిల్లా ప్రాజెక్టులు వెనుకబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, ఉదయ సముద్రం ప్రాజెక్టుల విషయంలో చాలా నిర్లక్ష్యం జరిగిందన్నారు. గతంలోనే 90 శాతం పూర్తయిన బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పనులు పదేళ్లలో 10 శాతం పనులు పూర్తి కాలేదంటే ఎంత నిర్లక్ష్యం చూపారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు నిధుల మంజూరునకు మంత్రులుగా, ప్రజాప్రతినిధులుగా తమ వంతు కృషిచేస్తామని, అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.



అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మట్టపల్లిలో నృసింహుడి నిత్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూల విరాట్‌కి పంచామృతాభిషేకం నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా ఆలయంలోని ముఖమండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాబాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

టీ నేతన్న యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి


టీ-నేతన్న యాప్‌ను చూపిస్తున్న అలుగు వర్షిణి, పక్కన కలెక్టర్ హనుమంత్ జెండగే

భూదాన్‌పోచంపల్లి: తెలంగాణ నేతన్న(టీ నేతన్న) యాప్‌ను ప్రతి చేనేత కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి అన్నారు. గురువారం యాదాద్రి కలెక్టర్ హనుమంత్ జెండగేతో కలిసి పోచంపల్లి పట్టణ కేంద్రంలోని రూరల్ టూరిజం పార్కులో ఆమె టీ-నేతన్న మొబైల్ యాప్ గురించి విలేకరులకు వివరించారు. అండ్రాయిడ్ ఫోన్‌లోని ప్లేస్టోర్ ద్వారా టీ-నేతన్న యాప్‌ను చేనేత కార్మికులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అందులో ఉన్న వివరాలన్నీ నింపి, తమకు చెందిన జియో ట్యాగింగ్ మగ్గం వద్ద ఫొటో తీసుకొని అప్‌లోడ్ చేస్తే గుర్తింపుకార్డు వలె అన్ని వివరాలు నమోదవుతాయని చెప్పారు. తద్వారా ప్రభుత్వ పథకాలలో ఏదైనా సమస్యలున్నా, అందకపోయినా, ఆయా స్కీమ్‌లకు ఉన్న అర్హత తదితర వివరాలను తెలుసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాక పథకాలలో ఏమైనా మార్పులు, చేర్పులు జరిగినా వెంటనే ఎస్‌ఎంఎస్ రూపంలో మెసేజ్‌లు వస్తాయని తెలిపారు. అంతేకాక చేనేత కార్మికులు అడ్రస్ మారినా, ఊరు మారినా జీపీఆర్‌ఎస్ ద్వారా వెంటనే అడ్రస్ మార్చుకోవాలని మెసేజ్ కూడా వస్తుందని తెలిపారు. ఒక్కసారి వివరాలను నమోదు చేస్తే చాలు అని, ఇంకా ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని అన్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 10 రోజుల్లో చేనేత కార్మికులంతా టీ-నేతన్న యాప్‌ను వినియోగించుకొనేలా చూడాలని ఆదేశించారు.

హ్యాండ్లూమ్ పార్కును ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దుతాం..

గతంలో టెస్కో కొనుగోలు చేసిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును వినియోగంలోకి తీసుకొచ్చి ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకొంటామని అలుగు వర్షిణి అన్నారు. దేశంలో మొట్టమొదటి హ్యాండ్లూమ్ పార్కు కాబట్టి పలు ప్రతిపాదనలతో త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. హ్యాండ్లూమ్ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్‌గా తీర్చిదిద్దాలని, అలాగే మగ్గాలను నడపించి స్థానిక చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని మూడు, నాలుగు ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలిపారు. త్రిఫ్ట్ పథకం ప్రారంభమై రెండున్నర ఏళ్లు పూర్తయ్యిందని, ఈ స్కీమ్ కొనసాగుతుందని తెలిపారు. కానీ మిగతా స్కీమ్‌లపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకొంటుందో చూడాలని అన్నారు. సమావేశంలో వీవర్ సర్వీస్ సెంటర్ రీజినల్ ఆఫీస్ ఫర్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్, రాష్ట్ర చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఎం. వెంకటేశం, జిల్లా ఏడీ విద్యాసాగర్, చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, తహసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ బాలశంకర్, డీఓ ప్రసాద్, చేనేత టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, పాలాది యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

- నాగారం మండలం ఫణిగిరి వద్ద భార్యాభర్తలకు..
- చింతపల్లి మండలం విరాట్‌నగర్ వద్ద మరో జంటకు..

నాగారం: మండలంలోని ఫణిగిరి గ్రామ శివారులో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫణిగిరి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ అలీ, షేక్ మీరాబీ భార్యాభర్తలు. వీరు బుధవారం రాత్రి వ్యవసాయ పనులు ముగించుకొని ఎడ్ల బండిపై ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో తిరుమలగిరి నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న బొలేరో వాహనం ఫణిగిరి గ్రామ శివారులో వేగంగా వచ్చి వెనుక నుంచి ఎడ్ల బండిని ఢీకొట్టింది. దీంతో ఎడ్ల బండిపై కూర్చున్న మహబూబ్ అలీ, మీరాబీ ఎగిరి కింద పడడంతో వారికి గాయాలయ్యాయి. అదేవిధంగా బొలేరో వాహనం డోర్ రేకు గీసుకుపోవడంతో ఒక ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులుగౌడ్ తెలిపారు.

చింతపల్లి మండలంలో..

చింతపల్లి: మండల పరిధిలోని విరాట్‌నగర్ కాలనీ వద్ద హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై బైక్, బొలేరో వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలంలోని మొద్గులమల్లేపల్లి గ్రామానికి చెందిన శివలీల, జగన్ భార్యాభర్తలు. వీరు బైక్‌పై గురువారం హైదరాబాద్ వైపు వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న బొలేరో వాహనం విరాట్‌నగర్ కాలనీ వద్ద బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇరువురిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

కుమారుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- మద్యం సేవించి వచ్చి గొడ్డలితో దాడికి యత్నించిన మృతుడు
- తిరగబడి అదే గొడ్డలితో కొట్టిన నిందితులు
- చింతపల్లి మండలం గాసిరాంతండాలో ఘటన


రవీందర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న నాంపల్లి సీఐ నవీన్‌కుమార్

చింతపల్లి: భార్య, కుమారుడి చేతిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గాసిరాంతండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని గాసిరాంతండాకు చెందిన రమావత్ రవీందర్ (48) వ్యవసాయం చేయడంతో పాటు మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య మంగి, కుమారుడు శేషుకుమార్, కుమార్తె నిఖిత ఉన్నారు. కుమార్తె వివాహం చేశారు. కుమారుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన రవీందర్ నిత్యం భార్య, కుమారుడితో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో రవీందర్ బుధవారం ఓ ఫంక్షన్‌కు వెళ్లి పూటుగా మద్యం సేవించి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటికి వచ్చాడు. ఎంత తలుపులు కొట్టినా తీయకపోవడంతో భార్య మంగి, కుమారుడు శేషుకుమార్‌పై కర్ర, గొడ్డలితో దాడి చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో రవీందర్ ఇంటి తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించగా భయాందోళనకు గురైన అతడి భార్య, కుమారుడు తిరగబడి గొడ్డలితో రవీందర్‌పై దాడి చేయడంతో అతడు కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కాగా మద్యం మత్తులో ఉన్నాడని భార్య, కుమారుడు అతడిని పట్టించుకోలేదు. గురువారం ఉదయం లేచి చూసే సరికి మృతిచెంది ఉన్నాడు. ఈ విషయం బయటికి పొక్కకుండా బంధువుల సమక్షంలోనే అంత్యక్రియలు చేసేందుకు సిద్ధం కావడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రవీందర్ కుమార్తె రమావత్ నిఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం ఉదయం మృతిచెందాడు. వివరాలు.. తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామానికి చెందిన రూపని సతీష్(29) హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30న స్వగ్రామానికి వచ్చాడు. అదేరోజు గ్రామానికి చెందిన కొద్దిమంది యువకులు సతీష్‌ను పిలిచి కొట్టారు. అవమానాన్ని భరించలేక పురుగుల మందు తాగిన సతీష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. దాడికి పాల్పడిన వారి ఇంట్లో బుధవారం రాత్రి సతీష్ మృతదేహాన్ని అతడి బంధువులు ఉంచడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన భార్యాభర్తలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి
- కోలుకుంటున్న భార్య
- కుటుంబ కలహాలతోనే ఘాతుకం


నవీన్ (ఫైల్)


ఆస్పత్రిలో నిర్మల

అర్వపల్లి: కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలంలోని కొమ్మాల గ్రామంలో ఈ నెల 12న తేదీన జరగగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మాల గ్రామానికి చెందిన భాషపోలు నవీన్(35)ది వ్యవసాయ కుటుంబం. నవీన్‌కు 14 ఏళ్ల కిందట నిర్మలతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు అక్షిత, దీక్షిత ఉన్నారు. నవీన్, నిర్మల మధ్యన చిన్న చిన్న మనస్పర్థలు ఏర్పడడంతో గత రెండేళ్ల నుంచి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టగా.. చిన్న చిన్న విషయాలకు ఘర్షణ పడవద్దని ఇద్దరికీ నచ్చజెప్పారు. అయినప్పటికీ అప్పుడప్పుడు గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నెల 12న భార్యభర్తలిద్దరు తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పనులు చేసుకుంటూ అక్కడ కూడా ఘర్షణ పడ్డారు. క్షణికావేశంలో నిర్మల అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. దీంతో తాను కూడా తాగుతానని నవీన్ అక్కడే ఉన్న గడ్డి మందును తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి ఇద్దరిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నిర్మల సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కోలుకుంటుంది. కాగా నవీన్ మృతదేహానికి గురువారం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు అర్వపల్లి ఎస్‌ఐ బి. అంజిరెడ్డి తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్‌తో పాటు ముగ్గురికి గాయాలు
- వాహనాలను రోడ్డుపై నుంచి తొలగిస్తుండగా టిప్పర్, క్రేన్ మధ్యలో ఇరుక్కుని క్రేన్ డ్రైవర్ మృతి


ప్రమాదానికి గురైన మాచర్ల డిపో బస్సు

పెద్దవూర: ఆగి ఉన్న టిప్పర్‌ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బుధవారం అర్ధరాత్రి పెద్దవూర మండల పరిధిలో జరిగిన ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు 37 మంది ప్రయాణికులతో బుధవారం రాత్రి మాచర్ల నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. అదే సమయంలో పెద్దవూర మండలంలోని తుంగతుర్తి గ్రామ స్టేజీ వద్ద నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై టిప్పర్‌కు బ్రేక్ డౌన్ కావడంతో డ్రైవర్ రోడ్డుపైనే టిప్పర్‌ను పార్కింగ్ చేసి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ టిప్పర్‌ను గమనించక వెనక నుంచి ఢీకొట్టాడు. అప్పటికే బస్సులోని ప్రయాణికులు చాలామంది నిద్రలోకి జారుకున్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో బస్సు టిప్పర్‌ను ఢీకొట్టడంతో ప్రయాణికులు సీట్ల నుంచి కిందకు పడిపోయారు. దీంతో బస్సు డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను బస్సు నుంచి దింపి మరో బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించారు.

సాయం చేసేందుకు వచ్చి..


విజయ్‌కుమార్ చౌరస్య (ఫైల్)

రోడ్డుపై అడ్డంగా ఉన్న బస్సు, టిప్పర్‌లను తొలగించడానికి పోలీసులు రెండు క్రేన్లను తెప్పించారు. అందులో ఒక క్రేన్ డ్రైవర్ విజయ్‌కుమార్ చౌరస్య(40) టిప్పర్‌కు తాళ్లు కడుతుండగా మరో క్రేన్ ముందుకు జరగడంతో టిప్పర్, క్రేన్ మధ్యన ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బిహార్ రాష్ట్రం కాగా.. సుంకిశాల ప్రాజెక్టులో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సమీప బంధువు అజయ్ చౌరస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా రామకృష్ణ



దేవరకొండ: ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన ఉడుతల రామకృష్ణ ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలమల గోపిచంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన ఏబీవీపీ జాతీయ మహాసభల్లో రామకృష్ణకు జాతీయ కార్యవర్గంలో చోటు దక్కిందని ఆయన పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై స్పందిస్తూ ఏబీవీపీ బలోపేతానికి కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.

వీఆర్పీ నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్‌గా సురేష్



దేవరకొండ: విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్పీ) నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్‌గా దేవరకొండ మండలంలోని తూర్పుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన నూనె సురేష్ నియామకమయ్యారు. ఈ మేరకు విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎచ్చు సునీల్ గురువారం సురేష్‌కు నియామకపత్రం అందజేశారు. వీఆర్పీ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నూనె సురేష్ తెలిపారు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని కోరారు. తన నియామకానికి సహకరించిన వీఆర్పీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ మంటలంటుకొని ఆరుగురికి గాయాలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- బాధితులంతా పశ్చిమబెంగాల్‌కు చెందిన వలస కూలీలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

భూదాన్‌పోచంపల్లి: వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌సిలిండర్ నుంచి మంటలు అంటుకొని ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లిలో జరగగా, గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన శెట్టి సురేశ్ మూసీ పరివాహక గ్రామాలలో వరినాట్లు వేయించేందుకు బుధవారం ఉదయం పశ్చిమబెంగాల్‌కు చెందిన 10 మంది వలస కూలీలను రప్పించాడు. వారికి రేవనపల్లిలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం కల్పించాడు. వారికి వంట చేసుకొనేందుకు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్, గ్యాస్ పొయ్యితో పాటు వంట సామగ్రి ఇప్పించాడు. కాగా మధ్యాహ్నం వారు తరగతి గదిలో వంట చేసుకొంటుండగా ఒక్కసారిగా లేచిన పెద్ద మంట గ్యాస్‌పైప్‌కు అంటుకొని కాలిపోయింది. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన అబ్దుల్ హామీద్ మొల్ల, నాగేంద్రనాథ్ మండల్, సుజయ్‌ల శరీరం తీవ్రంగా కాలిపోయింది. జతిన్, సర్దార్, గరామి గాయాలతో బయటపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. జితేన్, సర్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిలెటెన్ స్టిక్స్, డిటోనేటర్ల ఫ్యూజ్ వైర్లు స్వాధీనం

ఆత్మకూరు(ఎం): మండలంలోని పుల్లాయిగూడేనికి చెందిన నర్రాముల రామలింగయ్య వ్యవసాయ భూమిలో రాళ్లను తొలగించడానికి ఓర్సు నర్సింహ అనే వ్యక్తి అనుమతులు లేకుండా మూడు డిటోనేటర్లు, నలభై జిలెటెన్ స్టిక్స్ పెడుతుండగా గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని జిలిటెన్ స్టిక్స్, డిటోనేటర్ల ఫ్యూజ్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఓర్సు నర్సింహపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడ రూరల్: పట్టణంలో గురువారం తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 9 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కోదాడ పట్టణ సీఐ టి. రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని కరూర్ వైశ్య బ్యాంకు ఎదురు వీధిలో నివాసముంటున్న ఇనకొల్లు అరుణ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి స్కూల్‌కు వెళ్లింది. తిరిగి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో పాటు లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 9 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. అదే ఇంట్లో కిరాయికి ఉంటున్న గుండెపంగు రాజ్యం ఇంట్లో కూడా దుండగులు దొంగతనానికి యత్నించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

VILLA FOR SALE
■ Ready To Occupy Duplex Luxury 3 BHK - 2340 Sft Villas in the Best Gated Community at Miryalaguda Next to New D-Mart. Club House, Swimming Pool Fully Operational. Must See Call: 7013578378. [H-788030]

Wanted

■ Wanted Asst. Prof. of CSE, ECE, EEE, MBA, Maths, English, Mechanical, Experienced AO, Scholarship incharge, Lady Hostel Warden, Supervisor, Cooks, Watchman, MLG : 9848207323, 9866349247 [Y-798297]

■ 7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F) అయ్యి ఖాళీగా ఉన్న యువతీ/యువకులకు మా కంపెనీలో ఉద్యోగాలు. జీతం: 13 వేలు+DA 6వేలు+ఫ్రీ రూం, నో ఫీజు. సింధూ ప్రమోషన్స్, బోయవాడ, నల్గొండ. 9963280512. [L-781192]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర।। 9177736926. [M-1221943]

■ సూర్యాపేటలో ఇంటివద్ద ఉండి మీకు నచ్చిన టైమ్‌లో Job చేయుటకు Inter ఆపైన చదివిన Male or Female వెంటనే కావలెను. శా : 15,000/-, బయోడేటాతో హాజరు కాగలరు. సంప్ర।। 8886977783. [M-1221887]

Services

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788966]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్) సంప్ర : ✆ 945 945 3338 [B-788]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.